PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
RNI NO.TELTEL/2022/83842

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ ‖ సంచిక 232 ‖ సంపుటి 4 ‖ మంగళవారం ‖ 12-05-2026 ‖ పేజీలు 4 ‖ వెల 3/-

## తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

- ఆరుగురు సభ్యులతో కమిషన్ పునర్వ్యవస్థీకరణ..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



2

# ప్రధాని మోడీ పిలుపును స్వాగతిస్తున్నాం..



"రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా.. రాజకీయాలకు అతీతంగా కేంద్రంతో కలిసి నడుస్తాం" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు ప్రకటించిన ఆయన, వికసిత్ భారత్ తరహాలోనే తెలంగాణను కూడా ప్రగతి పథంలో నిలబెడతామన్నారు. 2034 నాటికి రాష్ట్రాని వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో భాగంగా కేంద్రంతో 'ఇచ్చిపుచ్చుకునే' ధోరణితో ముందుకెళ్తామని, ఐడియాలజీలు వేరైనా తెలంగాణ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం పునరుద్ఘాటించారు. ఆదివారం ప్రధానితో అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్ చాట్ లో ఆయన పలు సంచలన అంశాలను వెల్లడించారు.

- అభివృద్ధి కోసం కేంద్రంతో చెయ్యి కలుపుతాం..
- సిద్ధాంతాలు వేరైనా తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం
- ప్రధాని మోడీ విజన్ 2047కు మద్దతు
- 2034 నాటికి వన్ ట్రిలియన్ ఎకానమీగా తెలంగాణ
- "బండి సంజయ్ కుమారుడి కేసులో తగ్గేదే లేదు
- నిష్పక్షపాత విచారణకు మహిళా ఐపీఎస్ నియామకం
- పోక్సో కేసులో రాజకీయ జోక్యం చెల్లదు
- అగ్రనేత గణపతి వస్తే వైద్యం, ఆర్థిక సాయం ఖాయం
- జనజీవన స్రవంతిలోకి వచ్చే మావోయిస్టులకు పునరావాసం
- దేశాన్ని సంక్షోభంలోకి నెట్టేలా కేంద్రం నిర్ణయాలు
- జెమిని సర్కస్‌లా బీజేపీ ఎన్నికల వ్యూహాలు
- 2029లో వన్ నేషన్ - వన్ ఎలక్షన్ వచ్చే ఛాన్స్
- తడిసిన ధాన్యంపై చింత వద్దు.. ప్రతి గింజనూ కొంటాం
- తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్రకు లేఖ రాస్తా..
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (ప్రభాత గమనం):

"రాజకీయాలు ఎన్నికల వరకే.. అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకు సాగాలి" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపును స్వాగతిస్తున్నామని, ఆ లక్ష్య సాధనలో తెలంగాణ భాగస్వామి అవుతుందని ఆయన ప్రకటించారు. ఆదివారం ప్రధానితో అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు.

### వికసిత్ భారత్ - విజన్ తెలంగాణ 2034


కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ – 2047 లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. "మా పార్టీలు, మా సిద్ధాంతాలు వేరు కావచ్చు.. కానీ అభివృద్ధి విషయంలో మాకు బేధాభిప్రాయాలు లేవు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది మా ప్రభుత్వ సంకల్పం. దీనికి ప్రధాని మోదీ కూడా సానుకూలత వ్యక్తం చేశారు" అని వెల్లడించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రాన్ని సరైన రీతిలో కోరలేకపోయిందని, కానీ తాము రాష్ట్ర హక్కుల కోసం పట్టుబడతామని చెప్పారు.

తరువాయి 2వ పేజీలో

### రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్ర మద్దతు తప్పనిసరి

తెలంగాణ అభివృద్ధికి సంబంధించి పలు కీలక ప్రతిపాదనలను ప్రధాని ముందు ఉంచినట్లు సీఎం తెలిపారు.

**మెట్రో విస్తరణ & ఆర్ఆర్ఆర్:** రీజనల్ రింగ్ రోడ్ (RRR) పూర్తి చేయడం, మెట్రో రైలు విస్తరణకు నిధులు కేటాయించాలని కోరారు.



2

## రూ.496 కోట్ల కుంభకోణం

- ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి
- మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు

హైదరాబాద్ (ప్రభాత గమనం):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ టెండర్లలో భారీ అవినీతి చోటుచేసుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఈ టెండర్ల ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.496 కోట్లను కాజేసేందుకు ప్రభుత్వం స్కెచ్ వేసిందని ఆయన మండిపడ్డారు. ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వ ధన దుర్వినియోగంపై లెక్కలతో సహా విమర్శలు గుప్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించతలపెట్టిన 76 పాఠశాలల టెండర్లు అసలు ధర కంటే 4.96 శాతం ఎక్సెస్ (అదనం) గా ఖరారు చేశారని హరీశ్ రావు పేర్కొన్నారు. "ప్రతి స్కూల్ నిర్మాణంలో కావాలనే అదనపు రేట్లు చూపించడం ద్వారా ప్రజల సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా మొత్తం 76 స్కూళ్ల టెండర్ల ద్వారా రూ.496 కోట్ల ప్రజా ధనాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పటాన్‌చెరులో భారీగా గంజాయి పట్టివేత

- రూ.2 కోట్ల విలువైన సరుకు స్వాధీనం
- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా చెక్ పెట్టిన పోలీసులు..
- ఏడుగురు నిందితుల అరెస్ట్

2



## చిలకలగూడ హత్య కేసులో 10 మంది అరెస్టు

- అమ్మాయి బావ, తండ్రి, సోదరులే నిందితులు
- 17 సార్లు కత్తితో పొడిచి దారుణం..
- ముందుగానే ప్లాన్.. పక్కాగా హత్యకు స్కెచ్..
- నిందితుల్లో ఇద్దరికి డ్రగ్ పాజిటివ్
- ప్రధాన నిందితుడు సాయికిరణ్ రౌడీషీటర్ అని వెల్లడించిన డీసీపీ రక్షిత

— వివరాలు 2వ పేజీలో



## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి




2

- రాబోయే 15 రోజుల్లో 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలి
- నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి
- ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

# ప్రధాని మోడీ పిలుపును స్వాగతిస్తున్నాం..



**మొదటి పేజీ తరువాయి..**

**టాస్క్ ఫోర్స్:** మెట్రోపాలిటన్ నగరాల అభివృద్ధి కోసం ప్రత్యేక 'టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

**మూసీ పునరుజ్జీవం:** మూసీ ప్రాజెక్టుతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్టులు, జాతీయ రహదారుల నిర్మాణంలో కేంద్ర సహకారం కోరారు. తమ ప్రణాళికలను వివరించేందుకు ప్రధాని 2 గంటల సమయం కేటాయిస్తే పూర్తి స్థాయి రోడ్ మ్యాప్ వివరిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

### బండి భగీరథ్ కేసు: చట్టం తన పని తాను చేస్తుంది

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన కేసుపై సీఎం తీవ్రంగా స్పందించారు. "చట్టానికి ఎవరూ అతీతులు కారు. మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదైంది. ప్రధాని పర్యటన బందోబస్తు వల్ల దర్యాప్తులో స్వల్ప ఆలస్యం జరిగింది కానీ, ప్రస్తుతం విచారణ వేగవంతం చేశాం" అని చెప్పారు. ఈ కేసు విచారణ బాధ్యతను మహిళా ఐపీఎస్ అధికారి రితురాజ్‌కు అప్పగించామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇటువంటి సున్నితమైన అంశాల్లో ఆధారాలు ఉంటే పోలీసులకు ఇవ్వాలి తప్ప, రాజకీయ విమర్శలు చేయకూడదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

### హింసను వీడితే మావోయిస్టులను స్వాగతిస్తాం

తెలంగాణలో మావోయిస్టుల సమస్యను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం అహింసా మార్గాన్ని ఎంచుకుందని సీఎం తెలిపారు. "బుల్లెట్ కాదు బ్యాలెట్" అనే నినాదంతో ఇప్పటివరకు 818 మంది మావోయిస్టులు లొంగిపోవడం రాష్ట్ర ప్రభుత్వ విజయం అని పేర్కొన్నారు. మావోయిస్టు అగ్రనేత గణపతి వంటి వారు జనజీవన స్రవంతిలోకి వస్తే వారికి అవసరమైన వైద్య మరియు ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకుంటామని ప్రకటించారు. మనుషుల ప్రాణాలకు విలువ ఇవ్వడమే కాంగ్రెస్ సిద్ధాంతమని ఆయన గుర్తు చేశారు.

### కేంద్ర విదేశాంగ విధానంపై విమర్శలు

రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తామంటూనే, కేంద్రం అనుసరిస్తున్న కొన్ని విధానాలను సీఎం ఎండగట్టారు. "అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెట్టారు. బంగారం కొనొద్దని, విమాన ప్రయాణాలు చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం" అని విమర్శించారు. విదేశాంగ విధానంపై అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే బీజేపీ ఎన్నికల వ్యూహాలను "జెమిని సర్కస్" తో పోల్చుతూ ఎద్దేవా చేశారు.

### మహిళా రిజర్వేషన్లు & జమిలి ఎన్నికలు

జమిలి ఎన్నికలపై స్పందిస్తూ.. 2029లో ఇవి జరిగే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే మహిళా రిజర్వేషన్లను అమలు చేయవచ్చని సూచించారు. లోక్‌సభ సీట్ల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా స్పష్టమైన ఫార్ములా ఉండాలని కోరారు. చివరగా, రైతుల సమస్యలపై మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

- ఆరుగురు సభ్యులతో కమిషన్ పునర్వ్యవస్థీకరణ..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్ (ప్రభాత గమనం):**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమితుల య్యారు. రాష్ట్రంలో మహిళల భద్రత, హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేసే ఈ కీలక కమిషన్‌ను పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం ఆదివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఛైర్‌పర్సన్‌తో పాటు మరో ఆరుగురు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కమిషన్ ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగనుంది.

### కమిషన్‌లో ప్రముఖులకు చోటు

ఈసారి మహిళా కమిషన్‌లో సామాజిక నేపథ్యం, ఉద్యమ స్మృతులు కలిగిన వ్యక్తులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది.

- సభ్యులుగా శంకరమ్మ, శ్వేత: మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ, తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతలకు కమిషన్‌లో సభ్యులుగా చోటు దక్కింది. వీరితో పాటు శశికళ యాదవరెడ్డి, సదాలక్ష్మి , రాధాబాయి, మరియు ఉజ్మా షకీరాలను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.

### మహిళా సాధికారతకు ప్రాధాన్యం

మహిళల సమస్యల పరిష్కారం, వేధింపుల నిరోధం మరియు మహిళా సాధికారత దిశగా ఈ నూతన కమిషన్ కీలకంగా వ్యవహరించ నుంది. వివిధ రంగాలకు చెందిన మహిళలను సభ్యులుగా ఎంపిక చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలపై మరింత పట్టు సాధించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి మరియు ఇతర సభ్యులు తమ బాధ్యతలను స్వీకరించనున్నారు.



# రూ.496 కోట్ల కుంభకోణం

- ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి
- మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు



**హైదరాబాద్ (ప్రభాత గమనం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ టెండర్లలో భారీ అవినీతి చోటుచేసుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఈ టెండర్ల ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.496 కోట్లను కాజేసేందుకు ప్రభుత్వం స్కెచ్ వేసిందని ఆయన మండిపడ్డారు. ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వ ధన దుర్వినియోగంపై లెక్కలతో సహా విమర్శలు గుప్పించారు.

### అదనపు రేట్లతో దోపిడీ!

రాష్ట్రవ్యాప్తంగా నిర్మించతలపెట్టిన 76 పాఠశాలల టెండర్లు అసలు ధర కంటే 4.96 శాతం ఎక్సెస్ (అదనం) గా ఖరారు చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. "ప్రతి స్కూల్ నిర్మాణంలో కావాలనే అదనపు రేట్లు చూపించడం ద్వారా ప్రజల సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా మొత్తం 76 స్కూళ్ల టెండర్ల ద్వారా రూ.496 కోట్ల ప్రజా ధనాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సీఎం సన్నిహితులకే కాంట్రాక్టులు..

ఈ టెండర్ల ప్రక్రియ అంతా పారదర్శకంగా జరగలేదని, కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితులైన వారికే ఈ కాంట్రాక్టులన్నీ దక్కేలా చక్రం తిప్పారని హరీశ్‌రావు ఆరోపించారు. "అన్ని స్కూళ్ల నిర్మాణ బాధ్యతలను సీఎం అనుయాయులకే కట్టబెట్టారు. ఇది ముమ్మాటికీ బంధుప్రీతి మరియు అవినీతికి నిదర్శనం" అని ఆయన విమర్శించారు.

### ప్రభుత్వాన్ని నిలదీస్తాం..

విద్యాసంస్థల నిర్మాణం పేరుతో సాగిస్తున్న ఈ దోపిడీపై బీఆర్ఎస్ పోరాడుతుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. తక్కువ ధరకే పనులు చేసే సంస్థలు ఉన్నప్పటికీ, కావాలనే అధిక ధరలకు టెండర్లు ఎందుకు కట్టబెట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రాబోయే 15 రోజుల్లో 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలి
- నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి
- ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**మహబూబాబాద్ మే11(ప్రభాత గమనం):**




ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం, హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతి గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, ఏ నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రముఖుల పేర్లు తప్పాయనే సంచలన వార్తలు రాకుండా చూడాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు ప్రతి బుధవారం రాజ కీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించా రు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హులైన ప్రతీ ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అవ్వాలన్నారు.

# బెల్ట్ షాపులను మూసివేయించండి

- లేదంటే పిల్లలతో పాటు ఆత్మహత్యే గతి
- ప్రజావాణిలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతికి ఓ ఇల్లాలి విజ్ఞప్తి
- బెల్ట్ షాపుల బారిన కుటుంబం
- మద్యం తాగి భార్య, పిల్లలను కొడుతూ వేధిస్తున్న భర్త

**నారాయణఖేడ్, ప్రభాత గమనం:**

"గ్రామంలో విచ్చలవిడిగా సాగుతున్న బెల్ట్ షాపుల వల్ల నా సంసారం కూలిపోతోంది. నా భర్త మద్యం తాగి నన్ను, నా పిల్లలను రోజూ చితకబాదుతున్నాడు. దయచేసి ఆ షాపులను మూయించండి.. లేదంటే మాకు ఆత్మహత్యే శరణ్యం" అంటూ ఓ ఇల్లాలు కన్నీటి పర్యంతమైంది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట గ్రామానికి చెందిన రూప అనే మహిళ సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి ముందు తన గోడును వెళ్లబోసుకుంది.

### కుటుంబాన్ని ఛిద్రం చేస్తున్న మద్యం

రూప తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె భర్త నీరుడి పాండు గ్రామాల్లో విచ్చలవిడిగా దొరుకుతున్న మద్యం సేవించి ప్రతిరోజూ ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నాడు. చిన్న చిన్న విషయాలకే తనను, పిల్లలను విచక్షణారహితంగా కొడుతున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ గృహ హింస కారణంగా పిల్లలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఇంట్లో ప్రశాంతత కరువైందని వాపోయింది.

### పోలీసులు పట్టించుకోవడం లేదు

తన భర్త వేధింపులపై ఇప్పటికే పోలీసులను ఆశ్రయించానని, అయితే వారు కనీస చర్యలు తీసుకోకుండా "మీరు మీరే సర్దుకుపోవాలి" అని ఉచిత సలహాలు ఇచ్చి పంపించేశారని రూప ఆరోపించింది. రక్షణ కల్పించాల్సిన పోలీసులే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై గ్రామస్థులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### బెల్ట్ షాపులే అసలు కారణం

గ్రామాల్లో గల్లీ గల్లీకి వెలిసిన బెల్ట్ షాపులే తన భర్త వ్యసనానికి ప్రధాన కారణమని ఆమె పేర్కొంది. ఎప్పుడు పడితే అప్పుడు మద్యం అందుబాటులో ఉండటం వల్ల సామాన్య కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆరోపించింది. నియోజకవర్గంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండి పట్టించు కోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పిల్లలతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన రూప, తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

# పటాన్‌చెరులో భారీగా గంజాయి పట్టివేత

- రూ. 2 కోట్ల విలువైన సరుకు స్వాధీనం
- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా చెక్ పెట్టిన పోలీసులు..
- ఏడుగురు నిందితుల అరెస్ట్

**పటాన్‌చెరు (ప్రభాత గమనం):**



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలో పోలీసులు భారీ గంజాయి రాకెట్‌ను ఛేదించారు. సుమారు రూ. 2 కోట్ల విలువైన 400 కిలోల గంజాయిని తరలిస్తున్న ముఠాను పక్కా సమాచారంతో పట్టుకున్నారు. కూకట్‌పల్లి ఎస్‌వోటీ (SOT) మరియు పటాన్‌చెరు పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ మెరుపు దాడిలో ఏడుగురు నిందితులు పట్టుబడగా, పెద్ద ఎత్తున సరుకును స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వెల్లడించారు. నిందితులు ఒక డీసీఎం (DCM) వాహనం మరియు ఒక కారులో అత్యంత చాకచక్యంగా గంజాయిని తరలిస్తుండగా పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా, ప్యాకెట్ల రూపంలో నిల్వ చేసిన 400 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితుల నుంచి వాహనాలతో పాటు ఆరు సెల్‌ఫోన్లను కూడా పోలీసులు సీజ్ చేశారు.

### సోలాపూర్ లింకులు..

పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ గంజాయిని మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన మనీషా పద్వాల్ అనే వ్యక్తికి సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఒడిశా సరిహద్దుల నుంచి ఈ భారీ కేపాసిటీ ఉన్న సరుకును సేకరించి, తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు తరలించేందుకు ఈ ముఠా ప్రయత్నించిందని డీసీపీ తెలిపారు. ఈ గొలుసుకట్టు నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు.

# చిలకలగూడ హత్య కేసులో 10 మంది అరెస్టు

- అమ్మాయి బావ, తండ్రి, సోదరులే నిందితులు
- 17 సార్లు కత్తితో పొడిచి దారుణం..
- ముందుగానే ప్లాన్.. పక్కాగా స్కెచ్.. నిందితుల్లో ఇద్దరికి డ్రగ్ పాజిటివ్
- ప్రధాన నిందితుడు సాయికిరణ్ రౌడీషీటర్ అని వెల్లడించిన డీసీపీ రక్షిత



**సికింద్రాబాద్, ప్రభాత గమనం:**

నగరంలో సంచలనం సృష్టించిన చిలకలగూడ యావన్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన 10 మంది నిందితులను అరెస్టు చేసినట్లు సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత వెల్లడించారు. ప్రేమ వ్యవహారమే ఈ హత్యకు దారితీసిందని, పక్కా ప్రణాళికతోనే యువకుడిని అంతమొందించారని ఆమె వివరించారు.

### ప్రేమ వ్యవహారమే ప్రాణం తీసింది

మృతుడు యావన్, నిందితుల కుటుంబానికి చెందిన అమ్మాయి గత రెండేళ్లుగా ప్రేమలో ఉన్నారు. వీరిద్దరూ స్కూల్ డేస్ నుంచే స్నేహితులు. అయితే, వీరి ప్రేమను అమ్మాయి కుటుంబ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. గతంలో యావన్‌ను పలుమార్లు హెచ్చరించినప్పటికీ అతను వినకపోవడంతో, అతడిని అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు.

### ఐదు రోజుల ముందే స్కెచ్.. రెక్కీ నిర్వహణ

హత్యకు ఐదు రోజుల ముందే నిందితులు పన్నాగం పన్నారు. యావన్ కదలికలపై నిఘా పెట్టి రెక్కీ నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో యావన్ తన స్నేహితుడు సుబ్బు ఇంటికి వెళ్తున్నాడనే సమాచారంతో నిందితులు అతడిని చుట్టుముట్టారు. ఒక నిందితుడు కత్తితో సుమారు 17 సార్లు యావన్‌ను విచక్షణారహితంగా పొడవగా, మిగిలిన వారు అతను పారిపోకుండా గట్టిగా పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన యావన్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### నిందితుల వివరాలు..

అరెస్టయిన 10 మందిలో 9 మంది మేజర్లు కాగా, ఒకరు మైనర్ ఉన్నారు. ఏ1 సాయి కిరణ్: అమ్మాయి బావ (చిలకలగూడ పీఎస్‌లో రౌడీషీటర్, ఇతని ప్రోద్బలంతోనే హత్య జరిగింది). ఏ2 నుంచి ఏ4: అమ్మాయి సోదరులు (పరమేశ్, వంశీకృష్ణ, మనీశ్). ఏ7 నుంచి ఏ9: అమ్మాయి తండ్రి నరసింహ, బాబాయ్‌లు శ్రీశైలం, మల్లేశ్. మిగిలిన వారు: శ్రీగిరి రాహుల్ (ఏ5), కుచ్చుల శివనందన్ (ఏ6), మరియు ఒక మైనర్ (ఏ10). నిందితులకు డ్రగ్ టెస్ట్ చేయగా రాహుల్, శివనందన్‌లకు పాజిటివ్ వచ్చినట్లు డీసీపీ తెలిపారు.

### భవిష్యత్తును పాడుచేసుకోవద్దు: డీసీపీ

కేసు దర్యాప్తు కోసం 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నట్లు డీసీపీ రక్షిత తెలిపారు. నిందితుల నుంచి బైక్, కత్తి, మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. 19 నుంచి 21 ఏళ్ల లోపు యువకులు ఇలాంటి నేరాలకు పాల్పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆమె హితవు పలికారు. ప్రతీకార దాడులకు పాల్పడినా, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## మొక్కజొన్న రైతుల గోస పట్టదా?

- కొనుగోలు కేంద్రాల్లో అధికారుల 'డోంట్ కేర్!

**కేసముద్రం, మే 11:(ప్రభాత గమనం)**

ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతుంటే, అధికారులు మాత్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి కేసముద్రం మండల అధ్యక్షులు బట్టు నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రైతులకు అండగా ఉండాల్సిన అధికారులే ప్రైవేటు వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న కొనుగోళ్లలో అధికారులు విధిస్తున్న నిబంధనలు రైతులను కుంగదీస్తున్నాయని అన్నారు . "బయట కాంటా వేయించుకుని రండి.. తర్వాత వేబ్రిడ్జి దగ్గర తూకం వేస్తాం" అని అధికారులు చెప్పడం వెనుక మతలబు ఏంటని నాగేశ్వరరావు ప్రశ్నించారు.బస్తాలో బరువు ఎక్కువ ఉంటే రైతులకు పైసా చెల్లించరట, కానీ తక్కువ ఉంటే మాత్రం రైతు నుంచే కోత విధిస్తారట.దీనిపై సొసైటీ సీఈఓను ప్రశ్నిస్తే.. "ఏమైనా అనుకోండి" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం అధికారుల అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు.ఒకపక్క అకాల వర్షాలు రైతులను వణికిస్తుంటే, మరోపక్క కాంటా సదుపాయం లేక రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. మండలంలో నిర్దిష్టమైన కాంటా కేంద్రాలు లేకపోవడంతో, గత్యంతరం లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తూ తక్కువ ధరకే పంటను అమ్ముకొని నష్టపోతున్నారని తెలిపారు.రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కనీసం రెండు అధికారిక కాంటా కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని తెలిపారు.తూకంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి, రైతులకు ప్రతి గింజకూ మద్దతు ధర దక్కేలా చూడాలన్నారు.రైతుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు చేపట్టాలన్నారు. "ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. రైతుల కష్టాన్ని దోచుకునే ప్రయత్నం చేస్తే సహించేది లేదు. త్వరలోనే అధికారిక కాంటా సౌకర్యాలు కల్పించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం అని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.




## ఆలయ భూమిని పరిరక్షించాలి

- తాళ్లపూసపల్లిలో భూఆక్రమణపై భగ్గుమన్న గ్రామస్తులు

**కేసముద్రం, మే 11(ప్రభాత గమనం):**

దేవాలయ అభివృద్ధి కోసం కేటాయించిన భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకోవాలని చూడటం అన్యాయమని, ఆ భూమి ఆలయానికి దక్కే వరకు పోరాడుతామని కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామ పెద్దలు స్పష్టం చేశారు. గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం భూమికి సంబంధించి కొనసాగుతున్న వివాదంపై సోమవారం గ్రామ పెద్దలు గళమెత్తారు.అనేక ఏళ్ల క్రితం గ్రామస్తులు, దాతలు వెంకటేశ్వర స్వామి ఆలయ అవసరాల కోసం కొంత భూమిని కేటాయించారని తెలిపారు. అయితే, ఇటీవల కొందరు వ్యక్తులు ఆ భూమిని తమ వ్యక్తిగత అవసరాల కోసం వాడుకోవాలని చూస్తున్నారని, అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామ పెద్దలు ఆరోపించారు. ఈ క్రమంలోనే తమపై పెట్టిన అక్రమ కేసుపై స్పందిస్తూ, సోమవారం వారు కోర్టుకు హాజరయ్యారు.దేవుని పేరిట ఉన్న భూమిని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.సదరు భూమిని కేవలం దేవాలయ అభివృద్ధి పనులకే వినియోగించాలని వారు డిమాండ్ చేశారు.ఈ భూమిని కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, అవసరమైతే ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామని తెలిపారు. "తరతరాలుగా దేవాలయానికి చెందిన భూమిని కొందరు తమ స్వార్థం కోసం హస్తగతం చేసుకోవాలని చూడటం దుర్మార్గం అని తెలిపారు.న్యాయం గెలిచే వరకు మా పోరాటం ఆగదని అన్నారు.ఈ కార్యక్రమంలో రావుల రవిచంద్ర రెడ్డి, గొర్రె వెంకన్న, బండి శ్రీను, గోడిశాల వెంకన్న, నరేటి కొమరయ్య, నార్ల రమేష్, మాచర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన కొమురవెల్లి పంచాయతీ కార్యదర్శి

- రూ. 10 వేల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన అధికారి
- సర్పంచ్ భర్త కూడా అరెస్టు
- సిద్ధిపేట జిల్లాలో కలకలం

**సిద్ధిపేట, మే11(ప్రభాత గమనం):**




సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి మరియు సర్పంచ్ భర్త ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. కొమురవెల్లి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడి ప్లాట్‌లో గ్రామ పంచాయతీ వారు డ్రైనేజీ పైప్‌లైన్ వేశారు. ఆ పైప్‌లైన్‌ను అక్కడ నుంచి తొలగించాలనే అధికారిక పని కోసం పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు గౌడ్ పది వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో సోమవారం పక్కా ప్రణాళికతో అధికారులు నిఘా పెట్టి పట్టుకున్నారు.

## కేసముద్రం పీఎంశ్రీ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

- 99 రోజుల ప్రజా పాలన - విద్యా వారోత్సవాలకు అంకురార్పణ

**కేసముద్రం, మే 11 (ప్రభాత గమనం) :**



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వేసవి శిబిరాలు చక్కని వేదికలని కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన అభివృద్ధి ప్రణాళిక'లో భాగంగా.. సోమవారం కేసముద్రం స్టేషన్‌లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాలను, వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చైర్‌పర్సన్ మాట్లాడారు....వేసవిలో అనవసరంగా బయట తిరుగుతూ ఎండదెబ్బ బారిన పడకుండా, ఇలాంటి శిక్షణ తరగతులకు హాజరుకావడం అభినందనీయమని తెలిపారు.విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బందెల రాజు మాట్లాడుతూ..ఈ శిబిరంలో విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.హ్యాండ్ రైటింగ్ మెరుగుపరుచుకోవడం, చిత్రలేఖనంలో మెళకువలు,మేధస్సుకు పదును పెట్టే ఇండోర్ క్రీడలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.శిబిరంలో పాల్గొన్న 50 మంది విద్యార్థులకు నిర్వాహకులు స్నాక్స్ మరియు స్టేషనరీ కిట్లను అందజేశారు. విద్యార్థుల ఉత్సాహం మధ్య తొలిరోజు శిక్షణ ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కాలేరు యాదగిరి, ఏఏపీసీ చైర్మన్ శ్రీమతి మంజుల, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోట కనకయ్య, చంద్రశేఖర్, రాజశేఖర్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## వేం అభినందన సభను జయప్రదం చేయాలి

- కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి పిలుపు

**కేసముద్రం, మే 11(ప్రభాత గమనం):**

రాజ్యసభ సభ్యుడుగా ఎన్నికై మొదటి సారిగా మన ప్రాంతానికి విచ్చేయుచున్న సందర్భంగా నిర్వహించే వేం నరేందర్ రెడ్డి సన్మాన,అభినందన సభకు కేసముద్రం మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వేం అభిమానులు భారీ ఎత్తున తరలి రావాలని మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మార్కెట్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనీ నేడు (మంగళవారం) బాలాజీ గార్డెన్ నందు రాజ్యసభ సభ్యుడుగా ఎన్నికై మొదటి సారిగా మన మహబూబాబాద్ కు విచ్చేయుచున్న వేం నరేందర్ రెడ్డికి సన్మాన, అభినందన సభ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారనీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండల నాయకులు,మున్సిపల్ చైర్మన్లు,వైస్ చైర్మన్ లు,వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు ,వార్డు సభ్యులు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఈ సభలో పాల్గొనీ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, ఆర్టీసీ అథారిటీ సభ్యులు రావుల మురళీ, నాయకులు నీలం దుర్గేశ్, చిలువేరు సమ్మయ్య గౌడ్, భానోత్ చిన్న వెంకన్న, వేముల శ్రీనివాస్ రెడ్డి, జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోకల శ్రీనివాస్, బనిశెట్టి వెంకటేశ్, భానోత్ బాలు నాయక్, డైరెక్టర్లు చిదురాల వసంత రావు, ఎండీ అయ్యూబ్ ఖాన్, కౌన్సిలర్లు తరాల వీరేష్ యాదవ్, ధారావత్ కిషోర్, బద్య నాయక్, అంగోత్ బాల, వల్లాందాసు రవి, భానోత్ బాలునాయక్ , కనుకుల రాంబాబు, ఎండీ తాజుద్దీన్, శ్రీరామ్ కిరణ్, షేక్ ముజ్జు, ఎండీ నయీం, రషీద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## రైతును దగా చేస్తే ఊరుకోం..

- కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నదాతలకు కష్టాలే
- బీఆర్ఎస్ నేత కన్నెబోయిన శ్రీను యాదవ్

**కేసముద్రం మే11(ప్రభాత గమనం):**




గత నెల రోజులుగా ధాన్యం కాంటాలు వేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని బిఆర్ఎస్ నాయకులు కన్నెబోయిన శ్రీను యాదవ్ మండిపడ్డారు. సోమవారం నాడు కేసముద్రం మండల కేంద్రంలో పత్రిక ప్రకటన విడుదల చేసి మాట్లాడారు..కల్లాల్లో ధాన్యాన్ని కాపాడుకుంటున్న రైతులకు భరోసా ఇచ్చే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, మిల్లులకు ధాన్యం తరలించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కల్లాల్లో ధాన్యం మొలకలెత్తుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. వెంటనే మిల్లులకు ధాన్యం తరలించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తరుగు పేరుతో రైతుల ధాన్యం నుంచి కోత విధించవద్దని, ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.



## నర్సంపేట ఆర్‌డీఓ కార్యాలయంలో విషాదం

- విధుల్లో ఉండగానే డీఏఓకు గుండెపోటు

**వరంగల్ మే11(ప్రభాత గమనం):**

నర్సంపేట డివిజనల్ పరిపాలనాధికారి (డీఏఓ) శ్రీనివాసరావు సోమవారం కార్యాలయంలో విధుల్లో ఉండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. ఆఫీసులోనే ఆయన స్పృహ తప్పి పడిపోవడంతో గమనించిన తోటి ఉద్యోగులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గతంలో ఈయన నెక్కొండ మండల తహసీల్దారుగా కూడా సేవలు అందించారు. ప్రస్తుతం నర్సంపేట ఆర్‌డీఓ కార్యాలయంలో తహసీల్దార్ హోదాలో డివిజనల్ పరిపాలనాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని తోటి సిబ్బంది, స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.



## శైలజ మృతిపై వీడిన మిస్టరీ

- భర్త, ఆర్మీ జవాన్ అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్ఐ సాయికుమార్

**గార్ల, మే 11:(ప్రభాత గమనం)**


వివాహిత శైలజ అనుమానాస్పద మృతి కేసులో చిక్కుముడి వీడింది. ఆమె మరణానికి భర్తతో పాటు మరో వ్యక్తి కారణమని ప్రాథమిక విచారణలో తేలడంతో పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను గార్ల సబ్ ఇన్స్పెక్టర్ బి. సాయి కుమార్ మీడియాకు వెల్లడించారు.తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన పులిగుజ్జు కవిత కుమార్తె యోధుల శైలజ, ముల్కనూరు గ్రామంలో నివసించేది. అయితే ఆమె మరణం సహజమైనది కాదని, తన అల్లుడు యోధుల సతీష్ కుమార్ (సంపత్) మరియు పిండిప్రోలు గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ కాంపాటి శ్రీరామ్ కలిసి పథకం ప్రకారం తన కుమార్తెను బలితీసుకున్నారని తల్లి కవిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు విచారణను వేగవంతం చేశారు.భర్త యోధుల సతీష్‌ను నిన్ననే అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.ఈ కేసులో సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్మీ జవాన్ కాంపాటి శ్రీరామ్‌ను ఈరోజు అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. "బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టాం. నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగింది. చట్టం ముందు ఎవరైనా సమానులే."ప్రస్తుతం ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. కుటుంబ కలహాలే ఈ హత్యకు దారితీశాయా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.

## బండి భగీరథ్‌పై విచారణ వేగవంతం చేయండి

- డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- ఎనిమిదో తేదీన ఫిర్యాదు వస్తే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు?
- ప్రత్యేక బృందాలతో దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశం
- బాధితురాలి స్టేట్ మెంట్ మరోసారి రికార్డు చేస్తామన్న పోలీసులు
- సాంకేతిక ఆధారాల సేకరణపై దృష్టి
- కేసు దర్యాప్తును ప్రభావితం చేయొద్దు :బండి సంజయ్ కు మంత్రి పొన్నం హితవు
- విచారణ కోసం బాలల హక్కుల కమిషన్ ప్రత్యేక బెంచ్ ఏర్పాటు

**హైదరాబాద్, ప్రభాత గమనం:**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో (POCSO) కేసులో తక్షణమే దర్యాప్తు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. ఈ కేసులో విచారణ జాప్యంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు.



### విచారణలో జాప్యంపై సీఎం ప్రశ్న

ఈ నెల 8వ తేదీనే ఫిర్యాదు అందినప్పటికీ, ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని సీఎం డీజీపీని నిలదీశారు. దీనిపై డీజీపీ స్పందిస్తూ.. ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్లలో పోలీసు సిబ్బంది బిజీగా ఉండటం వల్లే ఆలస్యమైందని వివరించారు. అయితే, కేసు తీవ్రతను దృష్ట్యా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సమగ్ర విచారణ జరపాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### మహిళా అధికారికి పర్యవేక్షణ బాధ్యతలు

సీఎం ఆదేశాల నేపథ్యంలో డీజీపీ స్పందిస్తూ.. కేసు దర్యాప్తు పర్యవేక్షణ బాధ్యతలను కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్‌కు అప్పగిస్తూ మెమో జారీ చేశారు. పోక్సో కేసు కావడంతో మహిళా అధికారి నేతృత్వంలో విచారణ సాగాలని నిర్ణయించారు. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశామని, అవసరమైతే మరోసారి స్టేట్‌మెంట్ తీసుకుంటామని డీసీపీ రితిరాజ్ తెలిపారు. ఫోన్ కాల్ డేటా సహా ఇతర సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నామని, బాధితురాలికి త్వరగా న్యాయం చేస్తామని ఆమె పేర్కొన్నారు.

### రంగంలోకి బాలల హక్కుల కమిషన్

మరోవైపు, ఈ కేసుపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా స్పందించింది. కమిషన్ ఛైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి పోలీసుల నుంచి వివరాలను తెప్పించుకున్నారు. విచా రణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేశారు.

### దర్యాప్తును ప్రభావితం చేయొద్దు: మంత్రి పొన్నం

ఈ వ్యవహారంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన పలుకుబడితో దర్యాప్తును ప్రభావితం చేయవద్దని సూచించారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరుపుతుందని, బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. విచారణలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పోలీసులైనా సరే కోర్టు ముందు దోషులుగా నిలబడాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# కొనుగోలు కేంద్రాల్లో సమన్వయంతో పని చేయాలి

- మిల్లర్లు, అధికారులతో కలెక్టర్ స్నేహ శబరీష్ సమీక్ష

**మహబూబాబాద్, మే11(ప్రభాత గమనం):**



ధాన్యం, మక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో అధికారుల, సిబ్బంది సమన్వయంతో పని చేసి రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, అధికారులు, రైస్ మిల్లర్లతో వరి ధాన్యం, మొక్క జొన్న కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధ్యానం, మొక్క జొన్న పంటల కొనుగోళ్లలో అధికారులు, రైస్ మిల్లర్లు కాంట్రాక్టర్ల, సెంటర్ నిర్వాహకులు, సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేసి రైతుల కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులు తెచ్చిన పంటలకు ఎఫెక్యు నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని ఆదేశించారు. రవాణా చేయు సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా హమాలీలను లారీలను సిద్ధంగా ఉంచుకోవాలని వెంట వెంటనే లోడింగ్, అన్లోడింగ్ చేసి రొటేషన్ పద్ధతిలో పంపాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి రవాణా సదుపాయాలను సమకూర్చుకోవాలని సూచించారు. రైతులను రైస్ మిల్లర్లు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు.

కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతు వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు త్వరగా పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోళ్ల రవాణా తరలింపు విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్ రెవెన్యూ పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు త్రాగునీరు, టెంట్, చైర్స్,వైద్య సేవలు అందించాలని, మొక్క జొన్న కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల్లో అధికారులు సంబంధిత సిబ్బంది మొక్క జొన్నలు వచ్చే వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని కొనుగోలు చేసిన జొన్నలను వెంట వెంటనే తరలించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల శాఖ అధికారి రమేష్, డిఎం సివిల్ సప్లై నరసింగరావు, సొసైటీ చైర్మన్ డీఎస్పీ తిరుపతిరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

-కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, మే11(ప్రభాత గమనం):**



సమ్మర్ క్యాంపులు పిల్లల మానసిక, ఆరోగ్య, విద్యా మేధస్సు వెలికి తీయడానికి ఉపయోగపడాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) లో జరుగుతున్న సమ్మర్ క్యాంపును పరిశీలించి పిల్లలతో స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాంట్ కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష తెలంగాణ ప్రత్యేక విద్య వారోత్సవాల సందర్భంగా మే 11 నుండి మే 17 వరకు వరకు నిర్వహించే విద్య వారోత్సవాలను షెడ్యూల్ వారీగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సాధారణ సమ్మర్ క్యాంపులు మే 11 నుండి మే 25 వరకు, (18) క్యాంపులు, పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థినీ విద్యార్థుల కోసం రీమిడీయల్ పీఎం శ్రీ పాఠశాలలో ప్రత్యేకంగా (రెండు సమ్మర్ క్యాంపులు), తొర్రూరు, మహబూబాబాద్ లలో కేజీబీవీ మరిపెడ లో (1) మొత్తం జిల్లాలో (21) సమ్మర్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్యాంపులలో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్య, క్రీడా, సాంస్కృతిక, తదితర ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం అసిస్టెంట్ డైరెక్టర్ అధికారి పర్యవేక్షణ లో సబ్జెక్టుల వారీగా నిపుణుల బోధనలతో పాటు డ్రాయింగ్, పెయింటింగ్, క్యారమ్స్, చెస్, మొదలగైన ఆటలు అందుబాటులో ఉంటాయని, అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తరగతుల అనంతరం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలలో గ్రంధాలయాలు ఏర్పాటు చేసి తగినన్ని బుక్కులు అందుబాటులో ఉంచాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థినీ, విద్యార్థులకు,పాఠకులకు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రత్యేక విద్యా వారోత్సవాలు జరిగే మే 11 నుండి మే 17 వరకు (7) ఏడు రోజులు పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు పునాది దినోత్సవం, పదవ తరగతి, రీమిడీయల్ క్యాంపు ల ప్రారంభం, సర్పంచులతో పాఠశాల విద్య కార్యక్రమాలపై వర్క్ షాప్, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం, గ్రంథాలయ దినోత్సవం, సాంస్కృతిక హస్తకళల దినోత్సవం, చివరి రోజు విద్యా విజయోత్సవ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం కోసం విద్యాశాఖ, జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుని పకడ్బందీగా కార్యక్రమాల నిర్వహణ చేస్తూ సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా నిర్వహించే అన్ని కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించడం కోసం విస్తృత ప్రచారం కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, విద్యాశాఖ అధికారులు శ్రీరాములు, అప్పారావు, మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ లో దళారుల దందా

- పట్టించుకోని అధికారులు
- సీపీఐ మండల నాయకుడు మంద భాస్కర్

**కేసముద్రం, మే 11 (ప్రభాత గమనం):**



కేసముద్రం వ్యవసాయ మార్కెట్ సమీపంలో జరుగుతున్న దళారుల దందాను మార్కెట్ అధికారులు అరికట్టలేక పోతున్నారని సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ విమర్శించారు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో ఒక పత్రిక ప్రకటన విడుదల చేసి మాట్లాడారు. దన్నసరి సొసైటీ ఆధ్వర్యంలో మార్క్ ఫెడ్ సంస్థ ద్వారా మార్కెట్ తో పాటు వివిధ గ్రామాలలో మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారన్నారు. కాంటాలు పెట్టిన బస్తాలను రవాణా చేసేందుకు లారీలు లేక, గన్ని సంచుల కొరత వల్ల రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపుల పడాల్సి వస్తుందన్నారు. రైతులు పండించిన పంటను విక్రయించేందుకు తీసుకు వస్తున్న సమయంలో కొంతమంది దళారులు మార్కెట్కు వెళితే ఆలస్యంతో పాటు రోజుల తరబడి పడిగాపుల పడాల్సి వస్తుందని మాయమాటలు చెప్పి రైతుల సరుకులను మార్కెట్ బయటనే కొనుగోలు చేసి జీరో దందా నిర్వహిస్తున్నారన్నారు. దీనివల్ల మార్కెట్ ఆదాయానికి గండిపడడమే కాకుండా, తేమ సాకు చూపుతూ ధర తగ్గిస్తూ, వే బ్రిడ్జిల వద్ద తూకం వేసి మిల్లులకు, ట్రేడింగ్ కంపెనీలు తీసుకొని వచ్చిన ట్రాక్టర్ల నుంచి 30 కేజీల మక్కలను తరుగు పేరుతో కోత విధిస్తూ దోపిడి చేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా నగతు డబ్బులు కావాలంటే ఒక్క శాతం డబ్బులను కట్ చేస్తూ, లేకపోతే వాయిదా పద్ధతిలో చెక్కులను ఇస్తూ బ్యాంకుల చుట్టూ రైతులను ప్రదక్షణాలు చేయిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తతంగం జరుగుతున్న మార్కెట్ అధికారులు కళ్ళున్న కబోది లాగా వ్యవహరించడం సిగ్గుచేటనీ , ఈ విషయం పై మార్కెట్ అధికారులు చర్యలు తీసుకుపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ దందా అంతా మార్కెట్ అధికారుల కనుసన్నాలలో జరుగుతుందా అని అనుమానం వ్యక్తం చేశారు. తక్షణమే మార్కెట్ అధికారులు చొరవ చూపి జీరో దందాను అరికట్టి, రైతులను మోసం చేసే దళారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## కేంద్ర మంత్రి కుమారుడిపై పోక్సో కేసు పెట్టాలి

- మహిళా కమిషన్ ను ఆశ్రయించిన బీఆర్ఎస్ నేతలు

**గార్ల, మే 11 (ప్రభాత గమనం) :**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్పై నమోదైన లైంగిక వేధింపుల కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇల్లందు మాజీ ఎమ్మెల్యే శ్రీమతి భానోత్ హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మహిళా నేతలు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్కు వినతిపత్రం అందజేశారు. మైనర్ బాలికపై వేధింపులకు పాల్పడిన సాయి భగీరథ్పై పోక్సో చట్టం కింద నిష్పక్షపాతంగా విచారణ జరిపి, కఠినంగా శిక్షించాలి.అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్న పోలీసు అధికారులపై తక్షణమే విచారణ జరిపించాలి. నిందితుడి కుటుంబ నేపథ్యం దృష్ట్యా బాధితురాలి కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారికి తగిన రక్షణ కల్పించాలని నేతలు కోరారు.ఈ సందర్భంగా హరిప్రియ నాయక్ మాట్లాడుతూ.. నిందితుడు ఎంతటి బలవంతుడైనా చట్టం ముందు సమానమేనని స్పష్టం చేశారు. బాధితురాలికి అండగా ఉండాల్సింది పోయి, ఆమె కుటుంబాన్ని వేధించడం అమానుషమని మండిపడ్డారు. ఈ విషయంలో మహిళా కమిషన్ తక్షణమే జోక్యం చేసుకుని బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా విభాగం కీలక నేతలు సుమిత్రానంద్, తుల ఉమా, హేమా సామల తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై ప్రభుత్వం మరియు యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ దాతృత్వం

**కేసముద్రం,మే:11 (ప్రభాత గమనం ):**

కష్టాల్లో ఉన్న వారికి మేమున్నాం అంటూ ఇంటికన్నె గ్రామానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ మరోసారి తమ ఉదారతను చాటుకుంది.ఇంటికన్నె గ్రామానికి చెందిన వర్దల్లి రమ ఇటీవల అకాల మరణం చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.నిరుపేద కుటుంబం కావడంతో, వారి తక్షణ అవసరాల నిమిత్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్వింటా బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు నలమాస సందీప్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా, ఏ కష్టం వచ్చినా తమ ఫౌండేషన్ సొంత కుటుంబంలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సాటి మనిషికి సాయం చేయడంలోనే నిజమైన తృప్తి ఉందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ సేవా కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు షరీఫ్, గంధసిరి మల్లేష్, గంధసిరి వెంకటేష్, చిర్ర సాయి, సోమారపు శశివర్ధన్ తదితరులు ఉన్నారు.






## 'లేబర్ కోడ్'లను తక్షణమే రద్దు చేయాలి

- కేసముద్రంలో లేబర్ కోడ్ ప్రతుల దహనం చేసిన సీఐటీయూ నాయకులు

**కేసముద్రం, మే 11 (ప్రభాత గమనం):**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లే జయరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్బీ గెస్ట్ హౌస్ సెంటర్ వద్ద కార్మిక వ్యతిరేక చట్టాల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జల్లే జయరాజ్ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు.దశాబ్దాల కాలంగా కార్మికులు పోరాడి, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి, వాటిని కార్పొరేట్లకు అనుకూలమైన 4 లేబర్ కోడ్లుగా మార్చడం దుర్మార్గమన్నారు.ఈ కొత్త చట్టాల వల్ల పని గంటలు పెరిగి, వేతనాలు తగ్గుతాయని, ఇది కేవలం బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు మేలు చేయడానికేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికుల, రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చి, వారికే వెన్నుపోటు పొడుస్తున్న పాలకులను ప్రజలు క్షమించరని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ నల్ల చట్టాలను రద్దు చేయాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు చాగంటి కిషన్, మంగీలాల్, బిక్షపతి, శ్రీనివాస్, రవి, ప్రకాష్, సరిత, లక్ష్మి తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.




## మున్నేరు - పాలేరు లింక్ ప్రాజెక్టుతో రైతాంగం గుండెల్లో 'నీటి' మంట!

- బీడు భూములుగా మారుతాయన్న ఆందోళనలో అన్నదాతలు..
- ఐక్యపోరాటానికి సిద్ధమవుతున్న గార్ల రైతులు

**గార్ల, మే 11 (ప్రభాత గమనం) :**

తరతరాలుగా మున్నేరు ప్రవాహాన్ని నమ్ముకుని పచ్చని పంటలతో అలరారుతున్న గార్ల మండల రైతాంగంపై ఇప్పుడు 'లింక్ కెనాల్' నీడలు ముసురుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మున్నేరు – పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టు, స్థానిక రైతుల పాలిట శాపంగా మారనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అభివృద్ధి పేరిట చేపడుతున్న ఈ మళ్లింపు ప్రక్రియ, మండల భవిష్యత్తును ఎడారిగా మార్చే ప్రమాదం ఉందని రైతులు గళమెత్తుతున్నారు.మున్నేరు ప్రవాహాన్ని ఇతర ప్రాంతాలకు మళ్లించడం వల్ల సహజసిద్ధంగా జరిగే జల పునరుద్ధరణ ప్రక్రియ దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో సతమతమవుతున్న గార్ల మండలంలో, ఈ ప్రాజెక్టు వస్తే భూగర్భ జల మట్టం పాతాళానికి పడిపోయే ప్రమాదం ఉంది.ప్రవాహం మళ్లితే మండలంలోని చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోనున్నాయి.సహజ ప్రవాహాలు ఆగిపోతే, పచ్చని పంట పొలాలు రేపు బీడు భూములుగా మారి, మండలం ఎడారిని తలపించే అవకాశం ఉందని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు.వ్యవసాయం కేవలం పంటలకు మాత్రమే పరిమితం కాదు. సాగునీరు లేకపోతే పశుగ్రాసం కరువై, పాడి పరిశ్రమపై ఆధారపడ్డ వేలాది కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటుంది. "నీరు లేని నేల.. ప్రాణం లేని శరీరం లాంటిది" అంటూ రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.ఈ క్లిష్ట పరిస్థితుల్లో రాజకీయాలకు, పార్టీలకు తావు లేకుండా మండల రైతాంగం అంతా ఒక్కతాటిపైకి రావాలని సామాజిక కార్యకర్త, రైతు బిడ్డ శీలంశెట్టి రమేష్ పిలుపునిచ్చారు. మన సాగునీటి హక్కును కాపాడుకోవడం మన బాధ్యతని, మన గోడు ప్రభుత్వానికి వినిపించాలంటే ఐక్యతే మార్గమని ఆయన స్పష్టం చేశారు."మున్నేరు నీరు – గార్ల రైతుల హక్కు! మన నేల – మన నీరు – మన భవిష్యత్తు!"అనే నినాదంతో మండల వ్యాప్తంగా చైతన్యం వెల్లువెత్తుతోంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో పునరాలోచన చేయాలని, స్థానిక రైతుల ప్రయోజనాలను కాపాడాలని జర్నలిస్టుగా మేం కోరుతున్నాం. లేనిపక్షంలో, ఈ గడ్డపై అన్నదాతల పోరాటం ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374